# పాపం! పెళ్ళి కొడుకు!!

-కొమరవోలు సరోజ
(కెనడా)

"ఎయిర్ ఇండియాలో వద్దురా అంటే విన్లేదు. జాగ్రత్తగా ప్రయాణం చెయ్యి. టొరంటో నుండి ఢిల్లీ వెళ్ళే వరకూ క్రూ సరిగ్గా వుండదు. కనీసం చిరునవ్వు కూడా వుండదు. సిక్కయితే ఎవరూ పట్టించుకోరు. లంచ్ కానీ, బ్రేక్ ఫాస్ట్ గానీ ఒకసారి వద్దన్నావంటే ఇంక ఆ రోజు తిండి ఖాళీయే. మనవాళ్ళు మనవాళ్ళతో 'రూడ్'గా వుంటారు. తెల్ల వాళ్లతో బాగానే వుంటారు. ఇండియన్ కాన్సిలేట్‌కి వెళ్ళి వీసా తీసుకోవటం తోనే మొదలవుతుంది ఆరూడ్‌నెస్.!!" కొడుకుతో చెప్పింది పార్వతి.

"అమ్మా! దిగులు పడకు. ఇండియాలో పెళ్ళి చేసుకుని అక్కడే స్థిరపడదల్చుకున్నప్పుడు విమానంలోనే రూడ్ నెస్‌కు అలవాటు పడటం మంచిదని నేననుకున్నాను. అదీగాక బ్రిటీష్ ఎయిర్ వేస్ కంటే సుమారు రెండు వందల యాభై డాలర్లు తక్కువకదా! అసలే నిరుద్యోగిని. కనీసం చిరుద్యోగిని కూడా కాదు. రూపాయల్లోకి మారిస్తే దాదాపు అయిదు వేలు. అందులోనూ పెళ్ళి కూతురు కూడా కాస్త పెంకి ఘటం అన్నావు కాబట్టి మరి నాకేదైనా ఉద్యోగం దొరికే వరకూ నన్ను నేను పోషించుకోవాలిగా!" బాధను వ్యక్తం చేయకుండా చెప్పాడు వేణు.


"ఒరేయ్ మీ అమ్మతో ఇలా కబుర్లు చెబుతుంటే లైన్లో నీ వెనక నిలబడిన వాళ్ళు మరొక్క నిమిషమైతే నిన్నూ, ట్రాలీనీ బలవంతంగా ముందుకు తోసేస్తారు" నవ్వుతూ చెప్పాడు ముకుందరావ్.

"అయితే నేను నడవక్కర్లేదుగా!" అంటూ ముందుకు సాగాడు వేణు. చెకిన్ అయిపోయాక మరొకసారి తల్లిదండ్రులకు బై చెప్పాడు.

"వెళ్ళగానే ఫోన్ చెయ్యి" చెప్పారు తల్లీ తండ్రీ ఇద్దరూను.

సూట్‌కేసులు చాలా బరువుగా వున్నాయి. వాటిని ఎత్తడం వేణుకి కాస్త కష్టమే అయింది. అసలే సన్నం, పైగా బలహీనం. ఆ సూట్‌కేసుల నిండా కార్నింగ్‌వేర్ గిన్నెలూ, రొట్టెలు చేసుకోడానికి టోర్‌టిల్లా మేకర్, టోస్టర్, ఇల్లు క్లీన్ చేసుకోవడానికి క్లీనింగ్ స్టఫ్ వగైరా వున్నాయి. తెల్ల కాగితాలొక పది బండిల్సు తీసుకెళ్తున్నాడు. ఉద్యోగాలకు అప్లికేషన్సు పెట్టడానికి.

సెక్యూరిటీ చెకింగ్, ఇమిగ్రేషన్ ఫార్మాలిటీస్ పూర్తయ్యాక తన హేండ్ లగేజ్‌తోటి పాసింజెర్స్ లాంజ్‌లోకి వెళ్ళి కూర్చున్నాడు. అతని హేండ్ లగేజ్, సెక్యూరిటీ వాళ్ళను సందేహంలో పడేసింది. అందులో వున్న వస్తువు పేరు చెబితే ఎవరూ నమ్మలేదు. అందుకని బయటకు తీసి చూపించాల్సొచ్చింది. అదొక పెద్ద డయనా సోర్. అతనికి ఆ బొమ్మతో ఆడుకోవటం అలవాటు. పాతికేళ్ళు దాటినా ప్రతి రోజూ దాన్తో ఆడుకుంటే గానీ తోచదతనికి. అందుకే తనతో పాటు తీసుకెళ్తున్నాడు. "ఈ బొమ్మేమిత్రా నీతో" అన్నాడు ముకుందరావ్. కానీ ఒక్కగా నొక్కడు. అపురూపంగా పెంచుకున్నారు. అందుకే గట్టిగా చెప్పలేక పోయాడు. ఆ చెప్పలేక పోవటం వల్లనే కొడుకుని ఈ విధంగా ఇండియా పంపవలసి వస్తుందని ఆయన మొట్టమొదటే ఊహించి వుంటే.... బహుశా కెనడా వచ్చినప్పటి నుండీ కొంత స్ట్రిక్ట్‌గా వుండే వాడేమో!



కారణాలు ఏవైనప్పటికీ అతి గారాబం వల్ల వేణు ఉన్న తెలివితేటల్ని సద్వినియోగ పరచుకోలేకపోయాడు. సరైన అర్హతలూ లేవు. వర్షానికి గాలి తోడైనట్లు కెనడాలో 'రెసెష' నొకటి. లిబరల్ పార్టీ పవర్‌లోకి వచ్చాకైనా జాబ్ సిచ్యువేషన్ మెరుగవుతుందనుకుంటే.... ఒకడికి ఉద్యోగం వస్తే ఇద్దరికి ఊడిపోతోంది. వేణు పదేళ్ళ వయసు లోనే కెనడా వచ్చినా ఆ వాతావరణానికి అడ్జస్ట్ కాలేకపోయాడు.

తల్లి పార్వతికి ఇదో పెద్ద వర్రీ అయిపోయింది. తమ సంపాదన అంతంత మాత్రమే. ఎన్నాళ్ళని పోషించటం. అందుకే ఈ నిర్ణయానికి వచ్చింది. తమ దూరపు బంధువుకు స్నేహితుడి కూతురీ పెళ్ళి కూతురు. అంతా తమ బంధువే కుదిర్చాడు. పెళ్ళి చూపులు చూడకుండానే అంతా నిశ్చయమై పోయింది. ఫొటోలో బాగానే వుంది ఆ పిల్ల. కాకపోతే వేణుకంటే కాస్త లావూ, కాస్త పొడుగూ అంతే. ఎలాగైనా వేణు జీవితంలో స్థిరపడటమే ఆమెక్కావలసింది. అసలు పార్వతికి తామిద్దరూ కూడా ఇండియా వెళ్ళి సెటిలవ్వాలనుంది. కానీ సాధ్యపడదు. అరవయ్యేళ్ళ ముకుందరావుకూ, యాభై దాటిన పార్వతికీ అక్కడెవరూ ఉద్యోగాలివ్వరు. స్వంత వ్యాపారం చేయడానికి కావలసిన డబ్బూ లేదు. ఒక్కగా నొక్క కొడుకు పెళ్ళి కెళ్ళడానికే డబ్బు లేదు. అప్పు చేస్తే తీర్చే మార్గం కూడా లేదు. ఏదో రోజులు వెళ్లబుచ్చుతున్నారు. కెనడా వచ్చేటప్పుడు ఎన్నో ఆశలతో వచ్చారు. రెండు మూడేళ్ళ వరకూ ఇండియా కంటే ఫరవా లేదనిపించింది. కానీ పదేళ్ళ తరవాత ఆలోచిస్తే... రావటం పొరపాటనిపించింది. పార్వతీ, ముకుందరావు లిద్దరూ కూడా వారి తల్లిదండ్రుల కడసారి చూపుక్కూడా నోచుకోలేదు. అందుకు కారణం డబ్బు. అదే పెద్ద బాధాకరమైన విషయం. వాళ్ళిద్దర్లో ఒక్కళ్ళయినా పెద్ద ఉద్యోగస్థులు కాకపోవటం ఇంకో సమస్య.

విమానంలో భోజనం చేశాడు వేణు. కానీ ఏమీ తృప్తిగా లేదతనికి. ఇంతకాలం తల్లి వంట తినటమే తప్ప మరెక్కడ తిన్నా ఏదో అరుచిగా అనిపించేది. ఎయిర్ ఇండియా బాంబే చేరేటప్పటికి లోకల్ టైమ్ తెల్లవారు ఝాము నాలుగ్గంటలయింది. రెండు గంటలకు పైగా వెయిట్ చేయాలి. వేరే ఫ్లయిట్ రావాలి. అది సింగపూర్ వెళ్తుంది మద్రాసు మీదుగా. కౌంటర్ దగ్గర నిలబడి బోర్డింగ్ పాస్ తీసుకుని దగ్గర్లో వున్న సోఫాలో కూర్చున్నాడు. కొంత సేపటికి అతనికి విపరీతమైన దాహం వేసింది. అక్కడ వున్న రెస్టారెంట్ దగ్గరకెళ్ళి మంచినీళ్ళడిగాడు. అక్కడి సర్వరు విచిత్రంగా చూస్తూ మంచినీళ్ళిచ్చి చెప్పాడు.

"ఈ నీళ్ళు మంచివికావు. మినరల్ వాటర్ కొనుక్కోండి" అని. కొద్దిగా తాగాక తల్లి మాటలు గుర్తొచ్చి మినరల్ వాటర్ కొన్నాడు. దాని ఖరీదు మూడు డాలర్లు. లేకపోతే యాభై అయిదు రూపాయలు అని చెప్పాడు. తప్పేదేముంది కనీసం విజయవాడ వెళ్ళే వరకైనా తను మంచి నీళ్ళ విషయంలో శ్రద్ధ తీసుకోవాలి అనుకుని డబ్బు ఇచ్చాడు.

* * * *

మద్రాసు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ చాలా అందంగా పరిశుభ్రంగా బాంబే ఎయిర్ పోర్ట్‌కంటే చాలా బాగుంది. మనుష్యులు కూడా బాంబే కంటే కొంచం పొలయిట్‌గా, చిరునవ్వుతో పాసింజెర్స్‌తో మాట్లాడుతున్నారు. వేణు దగ్గర వీడియోల్లాంటి దేమీ లేకపోవటం వల్ల సులభంగానే గ్రీన్ లైట్ వైపు నుండి బయటకు వచ్చాడు. అక్కడ మీనాక్షిని గుర్తుపట్టడం ఏం కష్టం కాలేదు.


ఫొటోలో లాగే వుంది మీనాక్షి. కాకపోతే కాస్త చిన్నకళ్ళు. చిన్నగా నవ్వుతూ దగ్గరకు వచ్చి షేక్ హేండిచ్చింది. నమస్కారం పెట్టబోతున్న వేణు వెంటనే చేతిని ముందుకు చాచాడు. ఇద్దరూ కల్సి సామాన్లు టాక్సీలో పెట్టారు. టాక్సీ సెంట్రల్ స్టేషన్ వైపు పరుగు తీసింది. వేణు ఆలోచనలు కూడా అలాగే పరుగు తీస్తున్నాయి. పెళ్ళి చూపులివి. టాక్సీలో, ఎయిర్ పోర్టులో, ఇంక రైల్లో అనుకుంటున్నాడు.

పినాకిని కదలడానికి సిద్ధంగా వుంది. పోర్టర్లు సామాన్లు కంపార్ట్‌మెంట్‌లో పెట్టి రెండు వందల రూపాయలు తీసుకున్నారు!

సర్దుకుని కూర్చున్న తరువాత మీనాక్షి చెప్పింది. "మీరు ఫిలప్ చేసి పంపిన అప్లికేషన్ నాకు బాగానే నచ్చింది. అందుకే పెళ్ళి చేసుకోవడానికి రమ్మన్నాను."

"అన్నింటికీ ఒప్పుకునే వచ్చేశాను" చెప్పాడు వేణు.

"వంట లెన్ని రకాలు చేస్తారు మీరు?" అడిగింది.



"ఎన్ని రకాల కూరగాయలూ వస్తువులూ దొరికితే అన్ని రకాలూను. గడ్డి పచ్చడి చేయమన్నా, గవ్వల వేపుడు చేయమన్నా సునాయాసంగా చేయగలను."

"నేను సునాయాసంగా అనగలనో! లేదో!"

"మీరేం సందేహించనక్కర్లేదు. అంతగా మీకు నచ్చకపోతే.... మీరు చెప్పినట్లు నేర్చుకుంటాను." నమ్రతగా జవాబిచ్చాడు.

"రెండు రోజులయ్యాక పనిమనిషిని కూడా మాన్పిస్తున్నాను."

"అన్నింటికీ సిద్ధమే" నవ్వి చెప్పాడు.

"పెళ్ళి సింపుల్‌గా జరిగిపోతుంది" చెప్పిందామె.

"పిల్లలు పుట్టాక జాగ్రత్తగా చూసుకోవాలి మిష్టర్ వేణూ"

"తప్పకుండా చూస్తాను. కాకపోతే నా ఉద్యోగం?"

"మీకు ఉద్యోగం వచ్చినప్పుడు ఆలోచిద్దాం. ఇరవై ఆరు నిండాక బ్యాంకు ఉద్యోగం రాదు. మెడిసిన్, ఇంజనీరింగ్‌ల్లో సీటు రాదు. ప్రైవేట్ కంపెనీల్లో పన్లు మీరు చేయలేక పోవచ్చు. ఇక పోతే బి.ఇడి ఒక్కటే పాజిబిలిటీ. పోతే దానికీ ఎంట్రెన్స్ రాయాలి. కాబట్టి మీరు ప్రస్తుతం జాబ్ గురించి కలలు కనకండి."

పినాకిని విజయవాడ చేరేవరకూ అతను చెయ్యవలసిన పన్లు చెబుతూనే వుంది మీనాక్షి. వేణు జాగ్రత్తగా వింటున్నాడు. అప్పటి వరకూ వున్న ధైర్యం సన్నగిల్లటం ప్రారంభించింది. తను రాకుండా వుంటే బాగుండేదేమో! అని అనిపిస్తోందతనికి. సరే చేసేదేముంది రేపేగా పెళ్ళి అనుకున్నాడు. అతనికి సంతోషంగా లేదు. అలాగని విషాదంగానూ లేదు. ఈ రెండింటికీ అతీతమైన భావం.

కనక దుర్గ ఆలయంలో సన్నాయి మేళం వీనుల విందుగా వుంది. మీనాక్షి తన హేండ్ బ్యాగ్‌లో వున్న మంగళ సూత్రం తీసి వేణుకిచ్చింది. వేణు కట్టేశాడు. పుజారి ఇద్దరి తలల మీద అక్షింతలు వేసి దీవించాడు. అంతే పెళ్ళయిపోయింది.

"మీరు కట్టరా మంగళ సూత్రం?" అడిగాడు వేణు.

"నేనా! (నవ్వి)..... అవసరం లేదులెండి. అదో దండగని తీసుకురాలేదు."

"ఒకటి నేను కొనాలని మా అమ్మ చెప్పింది."

"అక్కర్లేదన్నాను కదండీ. ఎవరం ఇంట్లో వుంటే వాళ్ళం వేసుకోవచ్చు. ఇది కేవలం సరదా కోసమే....."

గంటలో ఇంటికి చేరుకున్నారు. "ఈ రోజే మన శోభనం" అంటూ బెడ్‌రూమ్‌లోకి నడిచింది మీనాక్షి. బెడ్ మీద జీడిపప్పులూ, ద్రాక్ష, బాదం పప్పులూ చల్లి ఉన్నాయి పూలకు బదులు. "ఇదేమిటి?" విస్తుపోయాడు వేణు.

"అదంతే. పూలంటే వేస్టని నా ఉద్దేశ్యం. తిండికి తప్ప మరి దేనికి ఎక్కువ ఖర్చు చేయగూడదని మా నాయనమ్మ నేర్పింది."

అప్పుడే మరొక్కసారి తలెత్తి చూశాడు మీనాక్షిని. 'మీనాక్షి కాదు. "పర్వత వర్ధని" అనుకున్నాడు మనసులో. అప్పటికే తందూరీ చికెన్ అవీ తినేస్తోంది మీనాక్షి. ప్రేమగా తీసుకొచ్చి వేణూ నోట్లో చికెన్ ముక్క పెట్టింది. 'చికెన్ కూడా తింటావా వోరి దేవుడో.' అంటూనే భళ్ళున వాంతి చేసుకున్నాడు వేణు.

"నా జీడి పప్పులూ, నా బాదం పప్పులూ" అంటూ బెడ్ మీద నుంచి క్రిందకి తోసేసింది మీనాక్షి. వేణు తేరుకుని మామూలు మనిషి కావడానికో గంట పట్టింది.

"మీరు నాన్‌వెజ్ తింటారని చెప్పలేదేం!" ఆశ్చర్యంగా అడిగాడు వేణు.

"మీరు చికెన్ కూడా తినరా? పైగా కెనడాలో పెరిగారు. నాన్‌వెజ్ తినరని చెప్పలేదేం మరి?" అడిగిందామె.

"మీరు తింటారనుకోలేదు నేను"

"మీరు తినరనుకోలేదు నేను"

"సరే రాజీ. మీరు తినడం మానెయ్యండి" చెప్పాడు వేణు.

"మీరు తినటం అలవాటు చేసుకోండి"

"లేదు"

"లేదు"

"అయితే మనలో ఎవరో ఒకరు అడ్జస్ట్ కాక తప్పదు." చెప్పాడు వేణు.

"అవసరం మీది. మీరే కాంప్రమైజ్ కావాలి."

"నేనెంత చాకిరీ అయినా చేస్తాగానీ నాన్‌వెజ్ ముట్టుకోను. ఆ గిన్నెలు తోమను" వచ్చే దుఃఖాన్ని దిగమింగుకుంటున్నాడు వేణు.

మర్నాటి నుంచే పనంతా వేణు చెయ్యాల్సొచ్చింది. మీనాక్షి అసలు ఒక్క పని కూడా ముట్టుకోటం లేదు. ఉదయానే చెత్త పారబొయ్యటం, గుమ్మం కడిగి ముగ్గు వెయ్యటం, ఇల్లు చిమ్మటం, తడి బట్టతో తుడవటం, అంట్లు తోమటం, వంట చేయటం, ఆవిడ రాగానే టీ అందించడం, బజారు కెళ్ళి కూరలు తీసుకురావటం, అతనికి ద్విపాత్రాభినయం అయిపోయింది.



బజారెళ్ళేటప్పుడు ప్యాంటు - షర్టు. ఇంటికి రాగానే మీనాక్షిదో పాత చీర లుంగీ కట్టు సాయంత్రం ఆమె ఆఫీసు నుండి వచ్చేటప్పటికి మళ్ళీ ప్యాంటూ - షర్టూ, లేకపోతే లుంగీ. ఉద్యోగాన్వేషణకు టైమ్ సరిపోవటం లేదు. ఆ వచ్చిన ఒకటి రెండు ఇంటర్వ్యూలలో సెలెక్ట్ కాలేదు. చివరికి మీనాక్షి చెప్పిందే నిజయమ్యేట్లుందని మనస్సులో బాధ మొదలైంది. ఆ బాధ జ్వరంలోకి దింపింది. జ్వరంలో ఒకటే కలవరింతలు.

"ఒద్దు బాబోయ్ నాన్‌వెజ్. మీనాక్షి నీకు దణ్ణం పెడతా నన్నొదిలెయ్" అంటూ.

మీనాక్షి నవ్వుకుంది. "ఎవరి అలవాట్లు ఎవరూ ఎవరికోసం మానుకో నక్కర్లేదు. అవసరాన్ని బట్టి వాళ్ళే మారతారు" ఇది ఆమె స్వగతం. నాలుగు నెలలు గడుస్తుండగా వేణు ఇంక వుండలేక పోయాడు.

వాళ్ళమ్మా వాళ్ళకు కలెక్ట్‌కాల్ చేశాడు ప్రజా టెలిఫోన్ నుంచి.

"హలో వేణూ, ఏమిట్రా కులాసానా? ఏమిటీ టైంలో ఫోన్ చేశావ్. త్వరలో మాకు మనవడో మనవరాలో పుట్టబోతున్నారా?" ముకుందరావ్ మాట్లాడుతుండగానే పార్వతి ఆయన చేతిలోని ఫోను లాక్కుని

"ఏమిటి, కోడలు గర్భవతా?" ఆత్రుతగా అడిగింది.

"గర్భం ఆవిడక్కాదు. ఇంకో రెండు నెల్లుంటే నాకొస్తుంది...."

"ఏమిటా పిచ్చివాగుడు!"

"పిచ్చి పడుతుంది నిజంగానే. నేనుండలేను. ఎలాగో అక్కడే వుంటాను."

"నలుగురూ నవ్వుతార్రా"

"ఏముంది నవ్వడానికి! పెళ్ళి కెవ్వరూ రానే లేదు. శోభనం అసలు కానేలేదు."

పార్వతి చేతిలో నుండి ఫోను జారిన శబ్దం.

* * * *

"మీనాక్షి నేను వెళ్ళిపోతున్నాను. మా నాన్నగారు టికెట్ పంపించారు. మరి మీరు నాతో రావడం సాధ్యపడుతుందా?" వేణు అడిగాడు.

"మీకోసం నేను ఉద్యోగం మానుకుని రావాలా! అక్కడ ఉద్యోగాల్లేవని నా దగ్గర ఉద్యోగానికి మీరొచ్చిన సంగతి మర్చిపోయినట్లున్నారు. అక్కడికొచ్చి మీతో పాటు ఆచలిలో పడి తన్నుకుంటూ ఉద్యోగాల వేటలో అలసిపోయే ఉద్దేశ్యం నాకు లేదు. మీరు లక్షణంగా వెళ్ళొచ్చు. భారత దేశంలో ఉద్యోగాలకీ, పురుషులకీ కొరతేం లేదు.

"డబ్బు సంపాదించే పురుషుడు స్త్రీని ఎలా శాసించగలడో అలాగే సంపాదన లేని పురుషుణ్ణి స్త్రీ శాసించగలదు. నేను రేపీపాటికి నాకంటే ఎత్తుగా, బలంగా ఉన్నవాణ్ణి, నాకంటే ఎక్కువ నాన్‌వెజ్ తినేవాణ్ణి పెళ్ళాడగలను."

"పెళ్ళాడు తల్లీ! పెళ్ళాడు. నీకు గ్రీటింగ్స్ కూడా పంపిస్తాను" చేతులు జోడించాడు వేణు.

"మరేంటనుకున్నారు. ఏదో ఇబ్బందుల్లో ఉన్నారని మీ బంధువు బ్రతిమాలితే ఒప్పుకున్నాను. ఏదో తెలుగు వాడివికదా పాపం అని. వచ్చినప్పటి నుంచి చికెన్ తిన్న కంచం కడగను. తలకు నూనె రాయను, చీరె ఇస్త్రీ చెయ్యనూ, జీన్స్‌కి జిప్పర్ కుట్టను అవినాకు చాతగాదు అంటూ ఒకటే నస. మీరు చేసే అంతోటి పనికి మీకు తిండి పెట్టటం వేస్ట్. మద్రాసులో దిగినప్పటి నుంచీ ఇప్పటి వరకూ మీకోసం నేను చేసిన ఖర్చు ముప్ఫయివేలు. మీరు చేసిన పని పదివేల ఖరీదు కూడా లేదు. నా డబ్బు నాకిచ్చి వెళ్ళండి."

రొయ్యల వేపుడు తింటూ చెప్పింది మీనాక్షి.

"చచ్చాన్రా దేవుడో! నా దగ్గరంత డబ్బు లేదిప్పుడు ఏం చేయను!"


"బయటికెళ్ళి ఉద్యోగం సంపాదించుకో. ఇండియా ఎంత పురోగమించిందో తెలుసుకుని అక్కడ మీ వాళ్ళకి తెలియచేయి."

"లేదు లాభం లేదు. ఇక్కడి కాంపిటిషన్‌కి నేను తట్టుకోలేను. నేను వెళ్ళిపోతా. ప్లీజ్ పంపించెయ్యండి. ఎలాగోలాగా మీ డబ్బు మీకు పంపిస్తా" ప్రార్థించాడు వేణు.

"సరే అయితే ఇవ్వాళ రాత్రి మెయిల్లో మెడ్రాసు వెళ్ళు. ఈ విజయవాడలో రైల్వే బ్రిడ్జి మీద నడిచేటప్పుడు జాగ్రత్త. మద్రాసులో కూడా జాగ్రత్త. ఆరు నెల్లలోపల నా డబ్బు నాకు పంపించక పోతే చట్ట పరంగా మిమ్మల్ని లాక్కొచ్చి పడేస్తా తెల్సిందిగా!" హెచ్చరించింది మీనాక్షి.

"తెలియక పోవటమేం ఖర్మం. బ్రహ్మాండంగా తెలిసింది. ఈ రోజు సాయంత్రం నా వస్తువులు అమ్మకానికి పెట్టి వచ్చిన డబ్బు మీకిస్తాను" చెప్పాడు.

"ఇదుగో మీ డయనాసోర్ పట్టుకెళ్ళిపోండి"



విసిరి పడేసింది. అతని గుండె గుబుక్కు మంది. డయనాసోర్ అంటే ప్రాణం కనుక తననే విసిరేసి నట్లనిపించింది.

సాయంత్రం సేల్ మొదలైంది. ఆ బిల్డింగ్‌లో వాళ్ళూ ఎదురుగా ఉన్న బిల్డింగ్‌లోని అపార్ట్‌మెంట్ల వాళ్ళూ వచ్చి బెడ్ షీట్లు, టవల్సూ, కార్నింగ్ వేర్ గిన్నెలూ, టోర్‌టిల్లా మేకరూ అన్నీ కొనుక్కున్నారు. టీకెటిల్ కూడా సేలయిపోయింది. ఇకపోతే మిగిలింది డయనాసోరొక్కటే. ఎవరు బ్రతిమాలినా ఐదు వేల రూపాయలిస్తామన్నా వేణు దాన్ని అమ్మడానికి అంగీకరించలేదు.

ఆ సమయంలో మీనాక్షి ఇంట్లో లేదు. లేకపోతే ఎలా వుండేదో పరిస్థితి. అతను నిజంగా హోమ్ సిక్కయినాడు. డయనాసోర్ ఒక్కటే అతనికి ఊరట కల్గించేది. ప్రేమగా దాన్ని ఎత్తుకున్నాడు.

ఆ రోజు అమ్మకంలో పదివేల రూపాయలకు పైనే వచ్చింది. మీనాక్షి ఇంటికి వచ్చాక డబ్బు తాంబూలంలో పెట్టి ఆమెకు అందించాడు.

"కాళ్ళకు మ్రొక్కు" చెప్పిందామె.

పిచ్చి చూపులు చూశాడు వేణు. "మరేం ఫర్వాలేదు. పరిస్థితులు ఎప్పుడూ ఒక్కలాగే వుండవు. మార్పు సహజం. స్త్రీలు ఎంత ఉన్నత స్థితికి ఎదిగారో చూశారుగా!"

వంగి ఆమె పాదాలను కళ్ళకద్దుకున్నాడు. 'అభీష్ట సిద్ధిరస్తు' అనబోయింది కానీ..... 'విద్యా ప్రాప్తిరస్తు, ఉద్యోగ ప్రాప్తిరస్తు' అని దీవించింది.

"మిస్టర్ వేణూ కష్టపడి పనిచేసే తెలివితేటల్ని అభివృద్ధి చేసుకోండి. మిమ్మల్ని నేను పరిశీలనగా చూస్తూనే వున్నా. మీ కోరికలు కొండంత కృషి సూది మొనంత. వాస్తవాన్ని తెల్సుకోండి. మీరు తిరిగి వెళ్ళక్కర్లేదు. మణిపాల్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో డొనేషన్ కట్టి మీకు సీటు తెప్పిస్తున్నాను. త్వరలోనే మీ ప్రయాణం. కెనడాకు బదులు మణిపాల్ వెళ్తారు. కష్టపడి చదివి ఫస్ట్ క్లాస్ తెచ్చుకుని సమాజంలో మీ స్థాయిని పెంచుకోండి. కెనడాకు తిరిగి వెళ్ళాలనీ సోమరిగా ఉండాలనీ, మరీ కష్టమైతే వెల్‌ఫేర్ మీద బ్రతుకుదామనే ఆలోచనలు మానెయ్యండి. శలవల్లో కూడా మీరు రావడానికి వీల్లేదు. నేనే వచ్చి చూస్తాను. చదువుకునే వాళ్ళందరూ మీ కంటే మేధావులని అనుకోకండి. కృషి! కృషి. 'కృషితో నాస్తి దుర్భిక్షం' అన్నారు.

"మీరు ఉద్యోగం చేయకపోయినా ఫర్వాలేదు. ఇంజనీరింగ్ డిగ్రీ వచ్చి తీరాలి. అందువల్ల ఉపయోగం మీకు భవిష్యత్తులో తెలుస్తుంది."

"నాలుగు సంవత్సరాలు నాలుగు నిమిషాల్లా గడుస్తాయి. మీకన్న రెండేళ్ళు పెద్ద దాన్ని, కష్టపడి చదువుకున్నదాన్ని, జీవితం అంటే తెలిసినదాన్ని. నాలుగేళ్ళ తరువాతే మన మొదటి రాత్రి. అంత వరకూ గుడ్ నైట్" చెప్పి లైటార్పేసి అటు తిరిగి పడుకుంది మీనాక్షి.

వేణుకి అంతా అయోమయంగా వుంది.

ఏమైనా సరే తనకు సహాయపడిన వేణు బంధువు శాస్త్రిగారికీ, వేణు అమ్మా నాన్నలకూ ఇచ్చిన మాట తను నిలబెట్టుకోవాలి. అతనిలో ఏకాగ్రతనీ, పట్టుదలనీ క్రియేట్ చెయ్యాలి. అందుకు తను కఠినంగా ఉండక తప్పదు అనుకుంది మీనాక్షి.

ఇక్కడ తన్నాడుకునే వారెవరూ లేరు. కాబట్టి మీనాక్షి మాటే వింటాను అనుకుంటూ..... ఆమె నడుం చుట్టూ చెయ్యి వేసాడు వేణు.

"ఇంజనీరింగ్ డిగ్రీ అనుకోండి నిద్ర వచ్చే వరకూ వందసార్లు" అంటూ అతని చేతిని సున్నితంగా తీసేసి..." దోమలు కుడుతున్నాయి. చలి" అంటూ దుప్పటి కప్పుకుంది మీనాక్షి.

చేసేది లేక తను మరో దుప్పటి కప్పుకుని కళ్ళు మూసుకున్నాడు వేణు.